క్లుప్తంగా

గీత కార్మికులపై వివక్షత తగదు

దేవరుప్పుల : నిత్యం ప్రమాదభరిత జీవనోపాధితో జీవించే గీత కార్మికులపై బీఆర్ఎస్ ప్రభుత్వ వివక్షత తగదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబ్బ రాజశేఖర్‌గౌడ్ విమర్శించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తొమ్మిదేళ్లుగా ప్రభుత్వం పది బడ్జెట్‌లు ప్రవేశపెడితే ఏ బడ్జెట్‌లోనూ గీతకార్మికులకు ఒక్క పైసా కేటాయించలేదన్నారు. గీత కార్పొరేషన్‌ను రద్దు చేసి బీసీ కార్పొరేషన్‌లో కలిపిన సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని ఎద్దేవా చేశారు.

కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా ప్రదీప్



దేవరుప్పుల : కాంగ్రెస్ మండల సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌గా కోలుకొండ గ్రామానికి చెందిన గనుపాక ప్రదీప్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతు న్న పరిస్థితులకు అనుగుణంగా సోషల్ మీడియా ప్రాధాన్యతకు విలువలు తెచ్చేలా పాటుపడుతానన్నారు. బీఆర్ఎస్, బీజేపీల మోసపూరిత విధానాలను ఎండగట్టేందుకు విస్తృత ప్రచారం చేపడుతానని పేర్కొన్నారు. బాధ్యతలు అప్పగించిన జనగామ జిల్లా అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి, టీపీసీసీ సభ్యులు డాక్టర్ ఎల్.లక్ష్మీనారాయణనాయక్, మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణమూర్తిలకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

లింగాలఘణపురం: మండల కేంద్రానికి చెందిన ఇటుకల సత్యనారాయణ ఆవు శుక్రవారం బండ్లగూడెంలోని ఎస్ఎస్-60 ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. ఉదయం పాలు పిండి పొలంలో ఆవును మేపేందుకు తీసుకెళ్లాడు. తిరిగి దొడ్డి వద్దకు వచ్చే క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ కిందికి ఉండడంతో విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు రూ.70వేల విలువ ఉంటుందన్నారు.

14న లారీల గడ్డ వేలం

లింగాలఘణపురం: మండలంలోని నవాబుపేట అంగడిలో పశువులను ఎక్కించే లారీల గడ్డ, పగ్గాల విక్రయానికి ఈ నెల 14న వేలం నిర్వహించనున్నట్లు ఈఓ లక్ష్మీప్రసన్న తెలిపారు. ఈ నెల 10 నుంచి షెడ్యూల్ దరఖాస్తులు విక్రయించనున్నట్లు తెలిపారు. రూ.50 వేల డీడీతో ఈనెల 14న ఉదయం 10.30 షెడ్యూల్ దాఖలు చేయాలని, 11 గంటలకు టెండర్లు ఓపెన్ చేసిన అనంతరం వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ముగిసిన బొడ్రాయి పునఃప్రతిష్ఠ ఉత్సవాలు



చిల్పూరు: మండలంలోని లింగంపల్లి గ్రామంలో శుక్రవారంతో బొడ్రాయి పునఃప్రతిష్ఠ ఉత్సవాలు ముగిశాయి. గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన గద్దెపై ప్రధాన అర్చకులు చొదరిమఠం సంతోష్‌శాస్త్రి ఆధ్వర్యంలో అర్చకులు చంద్రశేఖర్‌శాస్త్రి, ఆదిత్యాశాస్త్రి, నవీన్‌శర్మ, విజయ్, విష్ణుష్, శివప్రసాద్ వేద మంత్రాల మధ్య ధ్వజస్తంభం, బొడ్రాయి, నవగ్రహాల ప్రతిష్ఠ ఘనంగా ముగిసింది. బొడ్రాయి ప్రతిష్ఠ చైర్మన్ గంగుల సంపత్‌రెడ్డి, సర్పంచ్ ఏదునూరి రవీందర్, ఎంపీటీసీ కంకటి రవీందర్, ఉప సర్పంచ్ కంకటి రాజన్న, సమ్మక్క-సారలమ్మ చైర్మన్ మోతె శ్రీనివాస్, సందోజు రవీంద్రచారి, ఎలిశాల తిరుపతి, రచ్చ రవీందర్, రజనీకాంత్, అపరాదపు రాజు, పున్నంచందర్ తదితరులు పాల్గొన్నారు.

అద్దె భవనమే.. పేరు మార్పు



చిల్పూరు: మండల కేంద్రంలో ఏళ్లుగా శ్రీ వెంకటేశ్వర మున్నూరు కాపు సంఘానికి చెందిన అద్దె భవనంలో ఆరోగ్య ఉపకేంద్రం ఉండేది. సంఘం సమావేశాలు జరిగితే ఆ రోజు ఆరోగ్య సేవలు బందే. నాయకులు మారుతున్నా ప్రత్యేకంగా భవనం మాత్రం మంజూరు ఇవ్వడం లేదు. ఇందులో కనీస వసతులు లేకపోవడంతో సిబ్బందితో పాటు వచ్చే రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల పల్లె దవాఖాన మంజూరైందని తెలువగా కనీస సౌకర్యాలు ఉన్న భవనంలోకి మారుస్తారని అనుకోగా అదే అద్దె భవనానికి ఆరోగ్య ఉప కేంద్రానికి బదులు పల్లె దవాఖానా అని సబంధిత అధికారులు పేరు రాయించి వెళ్లి పోయారు.



‘డిజిటల్ క్లాస్ రూం’పై అవగాహన పెంచుకోవాలి

● డీఈఓ రాము

జనగామ రూరల్: 'ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ డిజిటల్ క్లాస్ రూం' కార్యక్రమంపై ఉపాధ్యాయులు అవగాహన పెంచుకుని విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి పాటుపడాలని డీఈఓ రాము అన్నారు. శుక్రవారం పట్టణంలోని ధర్మకంచ జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయిలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ డిజిటల్ క్లాస్ రూంపై శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 22 పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు హాజరయ్యారని, ఇక్కడ శిక్షణ పొందిన తర్వాత తోటి ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. రోజు వారీ విద్యా బోధన, అభ్యసన ప్రక్రియలో నూతన టెక్నాలజీని నిరంతరం ఉపయోగించాలని చెప్పారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి నరసింహారావు, తోట రాజు, వాసుదేవరెడ్డి, శ్రీకాంత్, సూర్య తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈఓ రాము

20న సైన్స్ హాకథాన్ పోటీలు

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 20న నిర్వహించే విద్యా దినోత్సవం సందర్భంగా సైన్స్ హాకథాన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ కె.రాము తెలిపారు. జిల్లాలో కేజీబీవీలు, ఆదర్శ, ప్రభుత్వ, సాంఘిక సంక్షేమ, రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. 8 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు సింగిల్ లేదా నలుగురికి మించని జట్టుగా పాల్గొనాలన్నారు. ఈనెల 12 నుంచి 19వ తేదీ లోపు విద్యార్థి లేదా జట్టు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీకి సంబంధించి 77 కాన్సెప్టుల నుంచి ఒకటి ఎంపిక చేసుకుని.. దానిపై 2 నిమిషాలకు మించని ఒక విడియోను సిద్ధం చేసి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేయడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. ఆ తర్వాత 20వ తేదీన సంబంధిత హాక్‌థాన్ వెబ్‌సైట్‌లోకి సబ్మిట్ చేయాల్సి ఉంటుందన్నారు. ఎంపిక చేసుకున్న అంశాన్ని వివరించేందుకు ఒక కిట్ రూపొందించడానికి విలువ రూ.200 మించరాదని, ఒక పాఠశాల నుంచి ఎంతమందైనా పాల్గొన వచ్చని పేర్కొన్నారు. సందేహాలు నివృత్తి చేసుకోవడానికి టీ సాట్, జూమ్, వెబ్‌నార్ ద్వారా ఓరియంటేషన్ ప్రోగ్రాంను అనుసరించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా సైన్స్ అధికారిని 99635 63959 నంబర్‌లో సంప్రదించాలని ఒక ప్రకటనలో కోరారు.

అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో నంబర్‌వన్

● ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి సంక్షేమ రంగాల్లో దేశంలో అగ్రగామిగా ఉందని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం డివిజన్ కేంద్రంలో తెలంగాణ సంక్షేమ సంబురాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ఈఆర్ఎల్ ఫంక్షన్‌హాల్‌లో తహసీల్దార్ పూల్‌సింగ్‌చౌహాన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా డీజే సౌండ్స్ పాటలు, కోలాటాలు, బతుకమ్మలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కులాంతర వివాహాలు చేసుకున్న ఎస్సీలకు రూ. 2.5 లక్షలు ప్రోత్సాహకంగా అందిస్తున్నారన్నారు. అనంతరం ప్రభుత్వం నూతనంగా బీసీ కులవృత్తులకు వారికి అందిస్తున్న రూ.లక్ష చెక్కులు నియోజకవర్గంలో లాంఛనంగా ప్రారంభించి ముగ్గురికి అందజేశారు. అలాగే సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. కార్యక్రమంలో జెడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ మారపాక రవి, ఆర్డీఓ కృష్ణవేణి, ఎంపీపీలు కందుల రేఖ, చిట్ల జయశ్రీ, డీఆర్‌డీఏ డీపీఎం రాజేంద్రప్రసాద్, ఏసీపీ రఘుచందర్, సీఐ రాఘవేందర్, ఏపీఎం కవిత, సర్పంచ్ తాటికొండ సురేష్‌కుమార్, ఎంపీటీసీ సింగపురం దయాకర్ పాల్గొన్నారు.

రంగరాయగూడెంలో పర్యటించిన ఎమ్మెల్యే

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య చేపట్టిన ప్రగతి నివేదన యాత్రలో భాగంగా శుక్రవారం మండలంలోని రంగరాయగూడెంలో పర్యటించారు. గురువారం రాత్రి రైతువేదికలో పల్లె నిద్ర చేసిన ఎమ్మెల్యే ఉదయం గ్రామంలోని వాడవాడలా పర్యటించి ప్రజా సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో 30 మంది పేదలకు పక్కా ఇళ్లు లేవని గుర్తించి గృహలక్ష్మీ పథకం క్రింద ఇండ్లు మంజూరీ చేస్తానని హామీ చేశారు. అనంతరం ఇప్పగూడెంలో రైతు సమన్వయ సమితి సభ్యుడు మహేందర్ తండ్రి బుచ్చయ్య అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇప్పగూడెం సర్పంచ్ జక్కుల పరశురాములు, ఎంపీటీసీ నెలమంచ శైలజ అజయ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

గడపగడపకు కేసీఆర్ సంక్షేమ పథకాలు

జఫర్‌గఢ్: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ సంక్షేమ పథకాలు గడపగడపకు అందాయని ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. మండలంలోని సూరారం, తీగారం, లక్ష్మినాయక్ తండా, తిమ్మంపేట,తమ్మడపల్లి (ఐ) ఉప్పుగల్లు గ్రామాల్లో ఆయన ప్రగతి నివేదన యాత్రను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తిమ్మంపేటలో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ రడపాక సుదర్శన్, జెడ్పీటీసీ బేబీ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ గుజ్జరి రాజు, సర్పంచ్‌లు మల్లేషం, జయపాల్‌రెడ్డి, ఎంపీటీసీలు, జ్యోతి, రజిత యాకయ్య, స్రవంతి మొగిలి పాల్గొన్నారు.

‘ఏబీవీ’ కళాశాలలో దశాబ్ది ఉత్సవాలు

జనగామ రూరల్: స్థానిక ఏబీవీ డిగ్రీ కళాశాలలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం కళాశాలలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు రంగవల్లు, ఆట పాటలతో అలరించారు. పలు క్రీడాపోటీలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ నర్సయ్య మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారిని స్మరించుకొని వారి ఆశయాలు నెరవేరేలా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. అనంతరం పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్, సులేమాన్, రవిప్రసాద్, వెంకట్‌రెడ్డి,శైలజ, ఈశ్వర్, కల్యాణి, నళిని, నాగరాజు, గోవర్ధిని తదితరులు పాల్గొన్నారు.


ఉత్సవాల్లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



పాలకుర్తి టౌన్: పంటలకు గిట్టుబాటు ధర పెంచిన సందర్భంగా శుక్రవారం నియోజవర్గ కేంద్రంలో రాజీవ్ చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు దొంగరి మహేందర్, ఉమ్మడి జిల్లా శిక్షణ తరగతుల కన్వీనర్ పాకనాటి దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ వరికి మద్దతు ధర రూ.2203 పెంచడం అభినందనీయం అన్నారు.పెసలు, పత్తి ,మొక్కజొన్న,కందుల పై గిట్టుబాటు ధర కల్పించడంలో బీజేపీ ప్రభుత్వం రైతులకు న్యాయం చేస్తుందని అన్నారు. జనగామ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల మంజూరు చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పూసాల శ్రీమాన్, కమ్మగాని శ్రీకాంత్, మారం రవికుమార్, నిరంజన్ రెడ్డి, ఎనగందుల శ్రవణ్, రామారావు, దుంపల సంపత్,పెనుగొండ సోమేశ్వర్ పాల్గొన్నారు.

పాఠశాల విద్యను బలోపేతం చేయాలి


పాలకుర్తి: టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రదర్శన చేస్తున్న ఉపాధ్యాయులు

● టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రంజిత్

పాలకుర్తి: ప్రభుత్వ పాఠశాల విద్యను బలోపేతం చేయడానికి చేస్తున్న ప్రయత్నం ద్వారా పలు విద్యా సంస్థల ద్వారా చేయడం జరగాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రంజిత్ కుమార్ అన్నారు. శుక్రవారం పలు సంఘాల ఆధ్వర్యంలో పాలకుర్తి, ఈరవెన్ను గ్రామాల్లో బడి మనదే-బాధ్యత మనదే ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మండల అధ్యక్షుడు వీరమల్ల బాబయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. నోడల్ అధికారి యాకయ్య మాట్లాడుతూ ఇతర పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను ప్రోత్సహించాలని అన్నా రు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు, ఉపాధ్యాయులు శాగ నర్సయ్య, మధుకర్‌రెడ్డి, కేదారేశ్వర్, సరిత, కృష్ణమూర్తి, తోట వెంకటేశ్వర్లు, చిక్కుడు శ్రీనివాస్, సీహెచ్. రమేష్ పాల్గొన్నారు

పిల్లలు ఉన్నతులుగా ఎదగాలి

చిల్పూరు: పిల్లలు ఉన్నతులుగా ఎదగాలంటే ప్రభుత్వ బడిలో చేర్పించాలని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి అన్నా రు. మండలంలోని శ్రీపతిపల్లిలో శుక్రవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడిలో చేర్పించడం ద్వారా ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజనంతో పాటు నాణ్యమైన విద్య అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థికసాయానికి దరఖాస్తు చేసుకోవాలి

కొడకండ్ల : ప్రభుత్వం అందిస్తున్న లక్ష రూపాయల ఆర్థికసాయం కోసం రజక వృత్తిదారులంతా దరఖాస్తు చేసుకోవాలని రజక వృత్తిదారుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి దూదిగాని నాగరాజు ఒక ప్రకటనలో కోరారు. కులం, ఆదాయం, రేషన్ కార్డు, ఆధార్‌కార్డులు ఫొటో తీసుకొని మీ సేవ కేంద్రాల్లో ఈ నెల 20 వరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

‘కాంగ్రెస్ బలోపేతానికి పాటుపడతా’

చిల్పూరు : మండలంలో కాంగ్రెస్‌ను బలోపేతం కోసం పాటుపడుతానని కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బట్టమేకల లక్ష్మయ్య అన్నారు. మండలంలోని మల్కాపూర్‌లో శుక్రవారం పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర ఆదేశాల మేరకు గ్రామ శాఖ అధ్యక్షుడు పుల్యాల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో కిసాన్ సెల్ మండల అధ్యక్షుడిగా లక్ష్మయ్యను ఏకగ్రీవంగా ప్రకటించారు. కార్యక్రమలంలో పార్టీ మండల అధ్యక్షుడు గడ్డమీది సురేష్, కిసాన్‌సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు యాదిరెడ్డి, జిల్లా కార్యదర్శి మర్రి దుర్గాప్రసాద్, మహిళా అధ్యక్షురాలు శోభ, కొయ్యడ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజా సేవలను విస్తృతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

రఘునాథపల్లి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులతో పాటు, మచ్చలేని నాయకుడు ఎమ్మెల్సీ కడియం శ్రీహరి ప్రజా సేవను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా రైతుబంధు సభ్యుడు, మాజీ జెడ్పీటీసీ మారుజోడు రాంబాబు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఏఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో కడియం యువసేన ఆధ్వర్యంలో వడ్లకొండ శివప్రసాద్ అధ్యక్షతన జరిగిన సోషల్ మీడియా వారియర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి పనులు, సర్కారు పథకాల్లో కమీషన్లు తీసుకునే అలవాటు కడియంకు లేదని, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం మాత్రమే తెలుసన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎమ్మెల్సీగా ఆయన నిజాయితీగా పని చేసిన తీరును సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అదే సమయంలో ప్రతిపక్షాల విమర్శలు సమర్థవంతంగా తిప్పికొట్టాలని సూచించారు. ఈ నెల 12న హనుమకొండలో జిల్లాస్థాయి సోషల్ మీడియా వారియర్ల సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. యువకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ ఎంపీపీ మల్కపురం లక్ష్మయ్య గౌడ్, నాయకులు తూముకుంట్ల సురేందర్‌రెడ్డి, గొరిగె రవి, ఉత్తెపు సత్యనారాయణ, గడ్డమీది కిరణ్‌గౌడ్, ప్రకాష్‌రెడ్డి, వెంకట్‌నాయక్, గైని శ్రీనివాస్, జోగు గట్టయ్య, ఎదునూరి గట్టేశం, మాలోతు నర్సింహా, చెంచు రమేష్, ద్యావర యాకయ్య, హుస్సేన్‌నాయక్, ఎండీ.యాకుబ్ పాల్గొన్నారు.

ఉత్సవాలు నిర్వహించడం సిగ్గుచేటు

తరిగొప్పుల : అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం రూ.103 కోట్లు ఖర్చు చేసి దశాబ్ది ఉత్సవాలు నిర్వహించడం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి విమర్శించారు.శుక్రవారం మండల కేంద్రంలో పర్యటించిన ఆయన ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన జంగ వీరయ్య, మాశెట్టి సత్యనారాయణ, బండ వెంకటమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాల పేరిట ప్రజాధనాన్ని సీఎం కేసీఆర్ వృథా చేస్తున్నారని అన్నారు. స్థానికేతరుడిని ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని దోచుకోవడం తప్ప అభివృద్ధి సాధ్యం కాదన్నారు. తన హయాంలో మంజూరు చేయించిన సాగునీటి కాలువలను ఎమ్మెల్యే ముత్తిరెడ్డి నిర్మాణం చేపట్టలేక పోతున్నాడని అన్నారు. కార్యక్రమంలో నాయకులు వగలబోయిన యాదగిరి, గాదె మోహన్‌రెడ్డి, గోరంతల వీరన్న, అంకం సత్తయ్య, ఎర్రవెల్లి పోచయ్య, దామెర లూకా, ఎడ్ల నవీన్, దానియెల్, గొలుసుల రాజు, అంజయ్య, సాయిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, పోషిరెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


వీరయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న కొమ్మూరి

సంక్షిప్త సమాచారం

బాధిత కుటుంబానికి చేయూత

బచ్చన్నపేట : మండలంలోని వంగ సుదర్శన్‌రెడ్డి నగర్ గ్రామానికి చెందిన జంగం రాజలింగం మృతి చెందగా శుక్రవారం గ్రామస్తులు అంత్యక్రియలకు ఆర్థికసాయం అందించారు. సర్పంచ్ కోనేటి స్వామి, వంగ రత్నాకర్‌రెడ్డి , నల్లనాగుల వెంకటాచారిలు రూ.5వేల చొప్పున, మూసిని రాజు, బావండ్ల కృష్ణంరాజు, గొడుగు శ్రీనివాస్, చల్ల పూర్ణచందర్‌రెడ్డిలకు రూ.2వేల చొప్పున గ్రామస్తులు అందరూ కలిసి దాదాపు రూ.50 వేల సాయం బాధితుడి భార్య అన్నపూర్ణకు అందించారు. అందజేసిన వారిలో ఉప సర్పంచ్ చవాన్ నరేష్, నాయకులు సత్యనారాయణ, రాజు, బాలయ్య, అన్వర్, సిద్దిరాములు, రామచంద్రం, శ్రీకాంత్, ధనంజయ్‌కుమార్, అశోక్ ఉన్నారు.

ఆర్థికసాయం



దేవరుప్పుల : మండలంలోని చిన్నమడూరుకు చెందిన రాంపల్లి వెంకటేశ్వర్లు ఇటీవల గుండెపోటుతో మరణించగా బీఆర్ఎస్ మండల నాయకులు చామల విక్రమ్ రెడ్డి, సర్పంచ్ వంగ పద్మ వెంకటేశ్వర్లు బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి రూ. 5 వేలు, క్వింటా బియ్యాన్ని అందజేశారు. ప్రభుత్వపరంగా తగిన సాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు. పరామర్శించిన వారిలో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షురాలు గొడుగు సుజాత మల్లిఖార్జున్, గ్రామ పార్టీ అధ్యక్షుడు జనగాం సంతోష్ ఉన్నారు.

పరామర్శ

లింగాలఘణపురం: మండలంలోని నేలపోగుల గ్రామానికి చెందిన సిద్దిని నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆ కుటుంబానికి ఎంపీటీసీ గుగ్గిళ్ల నర్సయ్య శుక్రవారం పరామర్శించి క్వింటా బియ్యం అందజేశారు. ఆయన వెంట నాయకులు జోగు రాజు, కందగట్ల భాస్కర్, కొంరయ్య, ఉప్పలయ్య, సోమయ్య, సత్తయ్య, హరీష్, ప్రభాకర్, సాయి, సాగర్, ఉదయ్, సతీష్, శివకుమార్ తదితరులు ఉన్నారు.

బచ్చన్నపేట : మండలంలోని సాల్వాపూర్‌లో ఇటీవల మృతి చెందిన తన్నీరు ప్రవీణ్‌కుమార్ కుటుంబ సభ్యులకు పలువురు ఆర్థిక సాయాన్ని అందించారు. శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో రూ.12,500 నగదు అందించారు. మున్ముందు ఆ నిరుపేద కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పరామర్శించిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు సద్ది సోమిరెడ్డి, గ్రామ అధ్యక్షుడు చీర మల్లేశం, కనుకయ్య, కృష్ణ ఉన్నారు.

చిల్పూరు: మండలంలోని ఫత్తేపూర్‌కు చెందిన బీమగోని మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట సాదం గట్టయ్య, మంతెన లవన్‌కుమార్, సంపత్‌రెడ్డి, రాజేశ్వర్, బాలరాజు, పవన్, రాజయ్య, రాజు, కన్న య్య, భిక్షపతి, వెంకటయ్య ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్



కొడకండ్ల : తహసీల్దార్‌గా సి.అంజయ్య శుక్రవారం విధుల్లో చేరి బాధ్యతలు స్వీకరించారు. లింగాలఘణపురం తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై ఆయన ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ రెవెన్యూపరమైన సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూ మండల అభివృద్ధికి పాటుపడతానని అన్నారు.

డీసీఎంను ఢీ కొట్టిన కారు

● ఇద్దరికి గాయాలు

రఘునాథపల్లి: హన్మకొండ-హైదరాబాద్ జాతీయ రహదారిలోని కోమల్ల వద్ద ఓ కారు అదుపు తప్పి డీసీఎంను ఢీ కొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. హన్మకొండ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారుకు కోమల్ల క్రాసింగ్ వద్ద రోడ్డు దాటుతున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి డివైడర్‌ను ఢీకొట్టి జనగామ నుంచి వరంగల్ వెళ్తున్న డీసీఎంను ఢీ కొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి గాయాలైన ఇరువురిని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.

డీసీఎం వ్యాన్ బోల్తా

స్టేషన్‌ఘన్‌పూర్ : హైదరాబాద్ నుంచి హనుమకొండకు పెయిటింగ్ డబ్బాల లోడ్‌తో వెళ్తున్న డీసీఎం టైరు ప్రమాదవశాత్తు పేలి బోల్తాపడిన సంఘటన మండలంలోని ఛాగల్లు శివారులో శుక్రవారం ఇలా ఉంది. అల్ట్రాటెక్ పెయింట్స్ డబ్బాల లోడ్‌తో డీసీఎం వ్యాన్ హైదరాబాద్ నుంచి హనుమకొండకు వెళ్తుంది. వాహనంలో డ్రైవర్‌తో పాటు మొత్తం ముగ్గురు ప్రయాణిస్తున్నారు. అయితే వ్యాన్ మండలంలోని చాగల్లు శివారుకు వచ్చేసరికి ఒక్కసారిగా వాహనం ముందు టైరు పేలడంతో జాతీయరహదారిపై బోల్తా పడింది. ఆ సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడం, ఇతర వాహనాలు ఏమి రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. డీసీఎం వ్యాన్‌లో ఉన్నవారు సురక్షితంగా బయపడ్డారని, ఎలాంటి గాయాలు కాలేదని సీఐ రాఘవేందర్ తెలిపారు.


స్టేషన్‌ఘన్‌పూర్ : బోల్తా పడిన డీసీఎం వ్యాన్

తెలంగాణ రన్‌ను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న ఏసీపీ రఘుచందర్

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 12న పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 2కే రన్‌ను విజయవంతం చేయాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ డి.రఘుచందర్, సీఐ ఎ.రాఘవేందర్ కోరారు. ఏసీపీ కార్యాలయంలో శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా డివిజన్ కేంద్రంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి తెలంగాణ 2కే రన్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 7 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, యువకులు, విద్యార్థులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.